క్లుప్తంగా

ఈవీఎంల తరలింపు వాయిదా: కమిషనర్

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థకు రాష్ట్ర ఎన్నికల సంఘం కేటాయించిన ఈవీఎంలను బాపట్ల జిల్లా నుంచి శనివారం తరలించే ప్రక్రియ సాంకేతిక కారణాల వల్ల వాయిదా పడిందని నగర కమిషనర్ కీర్తి చేకూరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తరలింపు తేదీ ఖరారు అయిన వెంటనే ముందుగా తెలియజేస్తామని ఆమె పేర్కొన్నారు.

ముగిసిన తిరుపతమ్మ, గోపయ్యస్వామి తిరునాళ్ల

పాత గుంటూరు: కొరిటెపాడు ఆంజనేయపేటలో శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ, గోపయ్యస్వామి తిరునాళ్ల మహోత్సవాలు శుక్రవారం వైభవంగా ముగిశాయి. ఉదయం ఉత్సవమూర్తులకు పంచామృతాలతో అభిషేకం, అలంకార పూజ, అర్చన తదితర కార్యక్రమాలను వేద పండితులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం అన్నదానంలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమాల్ని ఆలయ నిర్వాహకులు కన్నసాని విజయకుమార్, రవికుమార్, బాజీ పర్యవేక్షించారు.

విద్యుత్ షాక్‌కు గురై బాలుడి మృతి

నగరంపాలెం: విద్యుత్ షాక్‌కు గురై బాలుడు మృతి చెందిన ఘటన శుక్రవారం సాయంత్రం ఎన్టీఆర్ కాలనీలో జరిగింది. అరండల్‌పేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అమరావతి రోడ్ ఎన్టీఆర్ కాలనీ ఒకటో వీధిలో ఉంటున్న ఎల్.మేరి కూలీ పనులకు వెళుతుంటుంది. ఆమెకు నలుగురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. అందులో నాలుగో వాడైన మహేష్ (11) మూడో తరగతి చదువుతున్నాడు. శుక్రవారం సాయంత్రం ఇంటి వద్ద పిల్లలతో ఆడుకుంటున్నాడు. ఈ క్రమంలో ప్లాస్టిక్ కర్ర పైనున్న విద్యుత్తు తీగలపై పడింది. దీంతో డాబా పైకెక్కి దాన్ని తీసుకునేటప్పుడు మహేష్ విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. ఆపస్మారక స్థితిలో ఉన్న అతడ్ని వెంటనే జీజీహెచ్ ఎమర్జెన్సీ వార్డుకు తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే అతను మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని పరీక్షలు నిమిత్తం శవగారానికి తరలించారు. అరండల్‌పేట పీఎస్ ఎస్‌ఐ ప్రసన్న కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

నగరంపాలెం: అనధికారికంగా, అధిక ధరలకు మద్యం సీసాలు విక్రయిస్తున్న ఓ వ్యక్తిని నగరంపాలెం పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రస్తుతం హనుమాన్‌నగర్‌లో ఉంటున్న ప్రకాశం జిల్లా పుచ్చకాయలపల్లి గ్రామానికి చెందిన ఏడుకొండలు కూలీ పనులకు వెళ్లేవాడు. అతను మద్యం దుకాణాల్లో సీసాలు కొనుగోలు చేసి, కేవీపీ కాలనీలో అధిక ధరలకు విక్రయించేవాడు. ఈ క్రమంలో పోలీసులు శుక్రవారం అతన్ని అరెస్ట్ చేసి, ఆరు మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు.


కారులో తరలిస్తున్న రూ. 2 లక్షలు పట్టివేత

నగరపాలెం: కారులో తరలిస్తున్న రూ. 2లక్షలను పోలీసులు పట్టుకున్నారు. పట్టాభిపురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జేకేసీ కాలేజీ రోడ్డులో శుక్రవారం తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో సత్తెనపల్లికి చెందిన టి.లక్ష్మయ్య కారులో రూ. 2 లక్షలను ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తుండటంతో, సీజ్ చేసి ట్రజరీ శాఖకు అప్పజెప్పారు. తనిఖీల్లో సీఐ విజయచంద్ర, ఎస్‌ఐ ఏకనాథ్, సిబ్బంది పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

కొల్లిపర: బాకీదారులు డబ్బులు అడగడంతో పాటు దౌర్జన్యం చేయడంతో మనస్తాపానికి గురైన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కొల్లిపరకి చెందిన ఆయోధ్య శివరామకృష్ణ (28) ఆదే గ్రామానికి చెందిన లింగాల శివరామకృష్ణ, కొల్లిపర శేషులకు బాకీ ఉన్నాడు. దీంతో ఇద్దరు డబ్బులు అడగటంతో పాటు కలసి కొట్టడంతో శివరామకృష్ణ మనస్తాపానికి గురయ్యాడు. దీంతో గురువారం రాత్రి తన ఇంటిలో తాటిదూలానికి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శుక్రవారం ఉదయం కుటుంబ సభ్యులు తలుపు తీయగా శివరామకృష్ణ ఉరివేసుకుని కనిపించటంతో పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రవీంద్రరెడ్డి తెలిపారు.

చెట్టు నుంచి మంటలు



పట్నంబజారు: నగరంలోని లాడ్జిసెంటర్ సమీపంలో ఎల్ఈఎం స్కూల్ వద్ద ఉన్న చెట్టులో శుక్రవారం సాయంత్రం ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అకస్మాత్తుగా తొర్రలో నుంచి మంటలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని అదుపు చేశారు. ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకపోవడంతో నగర ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

గతించిన వారిని స్మరించుకోవడం వరం

- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని
- గుడ్ ఫ్రైడే రోజు జాషువా సమాధికి నివాళి అర్పించడం పూర్వజన్మ సుకృతం
- చీత్కారాలు ఎదురైన చోటే సత్కారాలు పొందిన మహోన్నతుడు జాషువా
- గుడ్‌ఫ్రైడే సందర్భంగా సమాధుల తోటలో నివాళులు
- హాజరైన ఎమ్మెల్యే కిలారి రోశయ్య, నేతలు



జాషువా సమాధికి నివాళులు అర్పిస్తున్న మంత్రి రజిని, ఎమ్మెల్యే రోశయ్య



గుర్రం జాషువా సమాధి వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే ముస్తఫా, నూరిఫాతిమా తదితరులు

పట్నంబజారు: గతించిన వారిని స్మరించుకోవడాన్ని క్రీస్తు మానవాళికి ఇచ్చిన గొప్ప వరంగా భావించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని తెలిపారు. గుడ్‌ఫ్రైడే సందర్భంగా పాత గుంటూరులోని సమాధుల తోటలో శుక్రవారం మంత్రి రజిని, పొన్నూరు ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి కిలారి రోశయ్యలు మహాకవి గుర్రం జాషువా సమాధి వద్దకు చేరుకుని పూలమాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి రజిని మాట్లాడుతూ గుడ్‌ఫ్రైడే రోజు వేలాదిగా ప్రజలు సమాధుల వద్దకు తరలివచ్చి వారి కుటుంబసభ్యులను స్మరించుకోవడం, నివాళులర్పించడం గొప్ప విషయమని పేర్కొన్నారు. సామాజిక ప్రయోజనంతో గొప్ప రచనలు చేసి, తెలుగు వారి ఖ్యాతిని ఖండాంతరాలకు వ్యాపింపజేసిన గుర్రం జాషువాను ఈ రోజు స్మరించుకోవడం తన పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని చెప్పారు. కవిత్వాన్ని ఆయుధంగా చేసుకుని మూఢాచారాలపై తిరగబడ్డ తెలుగు బిడ్డ జాషువా అని కొనియాడారు. చీత్కారాలు ఎదురైన చోటే సత్కారాలు పొందిన వీరుడు అని చెప్పారు. జీవితంలో ఎవరైనా సరే ఎదురు దెబ్బలకు కుంగిపోకుండా ముందుకు సాగితే విజయం సాధించొచ్చని పేర్కొన్నారు.

శాంతికి ప్రతిరూపం క్రీస్తు: ఎమ్మెల్యే కిలారి రోశయ్య

శాంతికి ప్రతిరూపం ఏసుక్రీస్తు అని పొన్నూరు నియోజకవర్గ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి కిలారి రోశయ్య చెప్పారు. మంచి చేసేవారికి దేవుడు ఎప్పుడు అండగా ఉంటారని పేర్కొన్నారు. సమాజ హితం కోరేవారి వెంటే తాను ఉంటానని బైబిల్‌లో ప్రభువు చెప్పారని తెలిపారు. జాషువా లాంటి గొప్ప వ్యక్తికి గుడ్‌ఫ్రైడే రోజు నివాళి అర్పించడం తనకు గర్వకారణమని చెప్పారు. కార్యక్రమంలో ఎస్సార్ సీపీ నేతలు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అవధుల్లేని త్యాగం క్రీస్తు జీవితం

పట్నంబజారు: అవధుల్లేని త్యాగం ఏసుక్రీస్తు జీవితమని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా, వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ తూర్పు నియోజకవర్గ అభ్యర్థి షేక్ నూరిఫాతిమా చెప్పారు. గుడ్‌ఫ్రైడే పురస్కరించుకుని శుక్రవారం పాత గుంటూరు సుద్దపల్లి డొంకలోని క్రైస్తవ సమాధుల తోటలో కవి గుర్రం జాషువా సమాధికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ ఏసుక్రీస్తు త్యాగానికి గుర్తుగా గుడ్‌ఫ్రైడేను క్రైస్తవులు జరుపుకుంటారని తెలిపారు. తూర్పు నియోజకవర్గ అభ్యర్థి నూరిఫాతిమా మాట్లాడుతూ క్రైస్తవ సోదరులకు గుడ్‌ఫ్రైడే శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పొన్నూరు ఎమ్మెల్యే వైఎస్సార్ సీపీ గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి కిలారి రోశయ్య కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు పాల్గొన్నారు.

రంగస్థల నటుడు గుమ్మడి గోపాలకృష్ణకు సత్కారం



గోపాలకృష్ణను సత్కరిస్తున్న అతిథులు, నిర్వాహకులు

పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళా వేదికపై రామరాజు ఫౌండేషన్, యువకళా వాహిని సంయుక్త ఆధ్వర్యంలో సారిపల్లి కొండలరావు సారథ్యంలో శుక్రవారం ప్రముఖ రంగస్థల నటుడు గుమ్మడి గోపాలకృష్ణను సత్కరించారు. సభకు యువకళా వాహిని అధ్యక్షుడు లంకా లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించారు. సభలో మాజీ స్పీకర్ డాక్టర్ మండలి బుద్ధప్రసాద్, మన్నవ సుబ్బారావు, ఆంధ్రా ఆర్ట్స్ అకాడమి అధ్యక్షుడు దోగిపర్తి శంకరరావు, ఆలయ అధ్యక్షుడు సీహెచ్. మస్తానయ్య, రామరాజు ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ రామరాజు శ్రీనివాసరావు, జి. మల్లికార్జునరావు, డి. తిరుమలేశ్వరరావు పాల్గొని గుమ్మడి గోపాలకృష్ణను ఘనంగా సత్కరించారు. అనంతరం గుమ్మడి గోపాలకృష్ణ వివిధ పౌరాణిక నాటకాలలోని పద్యాల్ని రాగయుక్తంగా ఆలపించి ప్రేక్షకుల్ని ఆకట్టుకున్నారు.

జగనన్న 'సంక్షేమ'ంతో గెలుపు ఖాయం

నియోజకవర్గ అభ్యర్థి షేక్ నూరిఫాతిమా



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న నూరిఫాతిమా

పట్నంబజారు: రానున్న ఎన్నికల్లో కుట్రపూరితమైన కూటమితో టీడీపీ, జనసేలు వస్తున్నాయని, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజాబలంతో ఎన్నికలకు సిద్ధమవుతోందని తూర్పు నియోజకవర్గ అభ్యర్థి షేక్ నూరిఫాతిమా స్పష్టం చేశారు. నియోజకవర్గంలోని 14వ డివిజన్ డీఎస్‌నగర్, రెండో డివిజన్ సీతానగర్‌లో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూరి ఫాతిమా మాట్లాడుతూ రానున్న ఎన్నికలు దుష్ట చతుష్టయానికి, పేద వర్గాలకు మధ్య జరుగుతున్నాయని తెలిపారు. పేదల పక్షాన రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పోరాడేందుకు సిద్ధంగా ఉన్నారని ఆమె పేర్కొన్నారు. ఆయన అందజేసిన సంక్షేమం, చేసిన అభివృద్ధి రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ఘన విజయాన్ని తెచ్చిపెడతాయని ధీమా వ్యక్తం చేశారు. ప్రచారం ప్రారంభించిన నాటి నుంచి నియోజకవర్గ ప్రజలు తమ ఇంటి బిడ్డగా ఆశీర్వదిస్తున్నారని సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు వేముల జ్యోతి, మర్రి అంజలి, వైఎస్సార్ సీపీ నేతలు వేముల శ్రీనివాసరావు, సత్యం, నాగేశ్వరరావు, పల్లా శ్రీను, వేణు, బసవయ్య, జానీబాష, శ్రీనివాసరెడ్డి, రాజు, ముక్కంటి, శివనారాయణ పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యా రంగాన్ని పరిరక్షించాలి: యూటీఎఫ్

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించుకునేందుకు, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించడానికి ఉపాధ్యాయులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు తెలిపారు. బ్రాడీపేటలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఉమ్మడి గుంటూరు జిల్లా. యూటీఎఫ్ ముఖ్య నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యార్థికి నాణ్యమైన విద్య అందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఏప్రిల్ 23తో పాఠశాలల పని దినాలు పూర్తికావస్తున్నాయని, ఈ లోపే ప్రతి ఉపాధ్యాయుడు తమ ప్రాంతంలో బడి ఈడు పిల్లల్ని గుర్తించి బడిలో చేర్పించాలని కోరారు. తల్లిదండ్రులు సైతం ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లల్ని చేర్చాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సమావేశంలో యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షురాలు ఏఎస్.కుసుమకుమారి, రాష్ట్ర ప్రచురణల విభాగ చైర్మన్ ఎం. హనుమంతరావు, గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల ప్రధాన కార్యదర్శులు ఎం. కళాధర్, జి. విజయసారథి, ప్రధాన కార్యదర్శి ఏ. శ్రీనివాసరావు, బాపట్ల జిల్లా అధ్యక్షుడు జె.వినయ్ కుమార్, గుంటూరు జిల్లా సహాధ్యక్షుడు జి. వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సెప్సిస్ కారక సూక్ష్మజీవుల్ని గుర్తిస్తే చికిత్స సులభం



నిరంతర వైద్య విద్యా కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్లకు సర్టిఫికెట్ల పంపిణీ

గుంటూరు మెడికల్: ప్రాణాంతక ఆరోగ్య సమస్యల్లో సెప్సిస్ ఒకటని, వ్యాధికారక సూక్ష్మక్రిములను గుర్తిస్తే చికిత్స చాలా సులభం అవుతుందని ప్రముఖ పల్మనాలజిస్ట్ డాక్టర్ కనుమూరి శ్రీనివాసరావు అన్నారు. ఐఎంఏ గుంటూరు బ్రాంచ్ ఆధ్వర్యంలో, గురువారం సాయంత్రం జీఎంఏ హాలులో నిర్వహించిన నిరంతర వైద్య విద్యా కార్యక్రమంలో పాల్గొని ఆయన ప్రసంగించారు. సభకు ఐఎంఏ గుంటూరు శాఖ అధ్యక్షుడు డాక్టర్ నూతక్కి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. డాక్టర్ కనుమూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఊపిరితిత్తుల వ్యాధులకు కారణమయ్యే సూక్ష్మజీవులే వల్లే సెప్సిస్ ప్రబలమవుతోందని తెలిపారు. సూక్ష్మజీవులను గుర్తించేందుకు అనేక రకాల పరీక్షలు ఉన్నాయని, వాటిలో కల్చర్‌తో పాటు పీసీఆర్ పరీక్ష కీలకపాత్ర పోషిస్తుందని చెప్పారు. తొలిదశలోనే సెప్సిస్ కారక సూక్ష్మక్రిములను గుర్తిస్తే ప్రాణాపాయం నుంచి రోగిని రక్షించవచ్చని తెలిపారు. డాక్టర్ నరేన్ రావెల సెప్సి స్ చికిత్సకు ఏ యాంటీబయాటిక్స్ మంచివి? అనే అంశంపై మాట్లాడారు. సూక్ష్మజీవులను గుర్తించక ముందు యాంటీబయాటిక్స్, గుర్తించిన తర్వాత యాంటీబయటిక్స్ ఎంచుకోవడంలో జాగ్రత్త వహించాలని చెప్పారు. యాంటీబయాటిక్స్ ఇవ్వకముందే కల్చర్, పీసీఆర్ పరీక్షలకు శాంపిల్స్ సేకరించాలని సూచించారు. ప్రముఖ ఫిజీషియన్ డాక్టర్ కె.కళ్యాణ చక్రవర్తి మాట్లాడుతూ ఒకే రకమైన యాంటీబయాటిక్స్ అందరికీ ఒకే విధంగా పని చేయవని తెలిపారు. వ్యక్తి శరీరతత్వాన్ని బట్టి, ఇంతకుముందు వాడిన యాంటీబయాటిక్స్ తదితర అంశాలపై పనితీరు ఆధారపడుతుందని తెలిపారు. సమావేశంలో ఐఎంఏ ఉపాధ్యక్షులు డాక్టర్ వెలగా మహేష్, సంయుక్త కార్యదర్శి డాక్టర్ బాలనేని సాయికృష్ణ, సీనియర్ వైద్యులు డాక్టర్ జి. బాబూరావు, డాక్టర్ జి. వేణుగోపాల్ ,డాక్టర్ మద్దినేని జగదీష్ కుమార్ , ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షులు ఎలెక్ట్ డాక్టర్ జి. నందకిశోర్, వైద్యులు పాల్గొన్నారు .

ఉమేష్‌చంద్రకు ఘన నివాళి

తెనాలి రూరల్: దివంగత ఐపీఎస్ అధికారి చదలవాడ ఉమేష్‌చంద్ర 58వ జయంతిని శుక్రవారం తెనాలిలో ఘనంగా నిర్వహించారు. తెనాలి సబ్‌డివిజన్ పోలీస్ అధికారుల ఆధ్వర్యంలో చెంచుపేటలో జరిగిన కార్యక్రమంలో అధికారులు, ఉమేష్ చంద్ర బంధువులు పాల్గొని ఘనంగా నివాళులర్పించారు. తెనాలి డీఎస్పీ ఎం. రమేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పోలీస్ అధికారులు, అభిమానులతో కలిసి ఉమేష్‌చంద్ర కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఉమేష్‌చంద్ర సేవలు స్ఫూర్తిదాయకమైనవని, ఆయన త్యాగం చిరస్మరణీయమైందని పేర్కొన్నారు. ఉమేష్ చంద్ర మన మధ్య లేకపోయినా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటారన్నారు. కుటుంబ సభ్యులు, సన్నిహితులు మాట్లాడుతూ ఉమేష్ చంద్ర దేశానికి ఎంతో సేవ చేశారని కొనియాడారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకుని మంచి కార్యక్రమాలు చేపడతామని తెలియజేశారు. కార్యక్రమంలో పట్టణ సీఐలు ఎస్. రమేష్‌బాబు, యం.దశరథ రామారావు, సిబ్బంది, ఉమేష్ చంద్ర కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

'టీడీపీకి ముస్లింలను ఓటు అడిగే అర్హత లేదు'



మసీదు వద్ద మాట్లాడుతున్న గుంటూరు జిల్లా వక్ఫ్ బోర్డు సభ్యుడు సయ్యద్ సుభాని తదితరులు

పెదకాకాని: గుంటూరులో జరిగిన నారా హమారా..టీడీపీ హమారా కార్యక్రమంలో ముస్లింలు యువకులు వారి సమస్యలు చెబుతుంటే అడ్డుకొని దేశద్రోహం కేసు పెట్టించిన టీడీపీకి ఓటు అడిగే అర్హత లేదని వక్ఫ్ బోర్డు డైరెక్టర్ సయ్యద్ సుభాని అన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ముస్లింకి కాకుండా పల్లె రఘునాథరెడ్డికి మైనారిటీ సంక్షేమ శాఖ ఇచ్చింది నారా చంద్రబాబునాయుడనే సంగతి ఇంకా మర్చిపోలేదన్నారు. నంబూరులోని మసీదు వద్ద శుక్రవారం ఆయన మాట్లాడారు. టీడీపీ ప్రభుత్వం బడ్జెట్‌లో ముస్లింల సంక్షేమానికి రెండు వేల కోట్ల రూపాయలు మాత్రమే కేటాయించిందని తెలిపారు. 2019 నుంచి వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి కోవిడ్ కష్టకాలాన్ని కూడా లెక్క చేయకుండా 58 నెలలో ముస్లింల సంక్షేమం కోసం రూ. 22 వేల కోట్లు ఖర్చు పెట్టినట్లు వివరించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇచ్చిన మాట ప్రకారం ఇమామ్‌లకు, మౌజన్‌లకు ఆర్థికసాయం చేయడం గర్వకారణమని పేర్కొన్నారు. దుల్హన్ పథకం కింద ఆడపిల్లలకు లక్ష రూపాయలు అందించినట్లు తెలిపారు. ముస్లిం ఆడపిల్లల భవిష్యత్తును దూరదృష్టిలో ఆలోచించి 10వ తరగతి చదువుకుంటేనే దుల్హన్ వర్తిస్తుందని చెప్పిన సీఎం వైఎస్. జగన్మోహన్‌రెడ్డికి మైనార్టీలందరూ నీరాజనం పలికారని చెప్పారు.

చెక్ పోస్టుల్లో నగదు పట్టివేత


తెనాలి రూరల్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్టుల్లో వాహనాల తనిఖీల్లో నగదు పట్టుబడుతోంది. మండలంలోని సంగంజాగర్లమూడి వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్టులో గురువారం రాత్రి ఓ కారులో రూ. రెండు లక్షల నగదును పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. జేఎంజే కళాశాల వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులో శుక్రవారం త్రీ టౌన్ పోలీసుల తనిఖీల్లో రూ. 3.50 లక్షలను పోలీసులు గుర్తించి స్వాధీన పర్చుకున్నారు.

బిజీ లైఫ్ స్టైల్‌తో పీసీఓడీ సమస్య

- పెరుగుతున్న బాధితులు
- ఆధునిక జీవన శైలి కారణం
- అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు

అరండల్‌పేటకు చెందిన శ్రీనివాస్, సుజాతలకు మూడేళ్ల కిందట వివాహమైంది. ఇద్దరు ఉద్యోగాలు చేస్తుండటంతో ఆలస్యంగా వివాహం చేసుకున్నారు. పెళ్లి అయి మూడేళ్లు గడుస్తున్నా గర్భం రాకపోవడంతో కుటుంబ సభ్యులు, స్నేహితులు, బంధువులు పదే పదే సంతానం గురించి ప్రశ్నిస్తుండటంతో వైద్యులను సంప్రదించారు. సుజాతకు పీసీఓడీ ఉండటం వల్ల గర్భం రావడం ఆలస్యమవుతోందని నిర్ధారించి చికిత్స అందించారు.

పల్నాడు జిల్లా మాచర్లకు చెందిన రామయ్య, జానకీలకు 22 ఏళ్లకే వివాహమైంది. జానకి సన్నగా ఉంటుంది. రోజువారి కూలి పనులు చేసుకుంటుంది. పెళ్లి అయి ఏడాదిన్నరైనా గర్భం రాకపోవడంతో బంధువులంతా వారిని సంతానం గురించి ప్రశ్నించడంతో వైద్యులను సంప్రదించారు. పరీక్షలు చేసి పీసీఓడీ ఉన్నట్లు నిర్ధారించి చికిత్స అందించారు. ఇలా అనేక మంది పల్లె, పట్నం అనే తేడా లేకుండా యువత, పెద్ద వారు సైతం పీసీఓడీ బారిన పడుతున్నారని వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



గుంటూరు మెడికల్: ఆధునిక జీవనశైలి, ఆహారపు అలవాట్ల వల్ల నేడు యువతుల్లో ఎక్కువగా పీసీఓడీ సమస్యలు కనిపిస్తున్నాయి. అండాశయాల్లో బుడగలు ఉండటాన్ని పాలిసిస్టిక్ ఓవరీ సిండ్రోమ్(పీసీఓడీ)గా పిలుస్తారు. కళాశాలకు వెళ్లి ఆడుతూ పాడుతూ చదువుకోవాల్సిన యువతులు నేడు ఎక్కువగా దీని బారిన పడి ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారు. ఉద్యోగాలు చేసే మహిళల్లో కూడా ఇదే సమస్య తరచుగా ఉత్పన్నమవుతూ మథనపడుతున్నారు. గతంలో 16 ఏళ్ల నుంచి 20 ఏళ్ల మధ్య వయస్సు వారిలో 10శాతం పీసీఓడీ సమస్యలు ఉండేవి. నేడు వీరి సంఖ్య 40శాతానికి పెరిగిపోవడంపై గైనకాలజిస్టులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మహిళల్లో సంతానలేమికి కారణం అయ్యే సమస్యల్లో పీసీఓడీ నేడు ప్రధానంగా కనిపిస్తోంది. కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా బారిన పడకుండా ఉండొచ్చని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

కారణాలు

పీసీఓడీకి అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, పోషకాహార లోపం, ధూమపానం, మద్యపానం, మానసిక ఒత్తిడి, ఆందోళన, జన్యుపరమైన తేడాలు, వ్యాయామం చేయకపోవడం, శారీరక శ్రమ లేకపోవడం, ఊబకాయం, పాశ్చాత్య జీవన విధానం , రాత్రిళ్ల ఎక్కువ సమయం సెల్‌ఫోన్స్, టీవీలు చూస్తూ సరిపడా నిద్రపోకపోవడం హార్మోన్స్‌లో అసమానతలు కారణాలు అవుతున్నాయి. కొన్నిసార్లు తల్లికి ఉంటే వారి బిడ్డలకు సైతం వారసత్వంగా ఈ వ్యాధి వచ్చే అవకాశం ఉంది.

లక్షణాలు

నెలసరి సక్రమంగా రాదు. ఆలస్యంగా వస్తుంది. కొన్నిసార్లు అధికంగా, కొన్నిసార్లు తక్కువగా రక్తం వస్తుంది. అండం సరిగా విడుదల కాకపోవటం వల్ల రక్తం కారటం ప్రారంభమవుతుంది. అండం సక్రమంగా విడుదల అవ్వకపోవటంతో పిల్లలు పుట్టడానికి అడ్డంకులు ఏర్పడాయి. బరువు పెరుగుతారు. శరీరంలోని వివిధ భాగాల్లో అనవసర వెంట్రుకలు పెరిగి ఇబ్బంది కలిగిస్తాయి. ఓవరీస్ సైజ్ పెరిగి వాటిల్లో నీటి బుడగలు ఏర్పడతాయి.

జనాభాలో పది శాతం బాధితులు

ఉమ్మడి గుంటూరు జిల్లాలో 250 మంది గైనకాలజిస్టులు వైద్యసేవలను అందిస్తున్నారు. ఒక్కో వైద్యుడి వద్దకు ప్రతినెలా 40 నుంచి 60 మంది పీసీఓడీ సమస్యలతో చికిత్స కోసం వస్తున్నారు. జిల్లాలోని జనాభాలో పదిశాతం మంది మహిళలు ఈ వ్యాధితో బాధపడుతున్నట్లు వైద్య నిపుణులు చెబుతున్నారు. గుంటూరు జీజీహెచ్‌లో ప్రతిరోజూ 300 మందికి పైగా పలు రకాల సమస్యలతో గైనకాలజీ వైద్య విభాగంలో మహిళలు చికిత్స పొందుతున్నారు. వీరిలో ప్రతిరోజూ ఐదు నుంచి పది మంది పీసీఓడీ బాధితులే ఉంటున్నట్లు వైద్య నిపుణులు వెల్లడించారు.

జీవన విధానంలో మార్పులు చేసుకోవాలి



పీసీఓడీని ప్రారంభదశలోనే గుర్తిస్తే మందులు వాడి జీవన విధానం మార్చుకుంటే సమస్యలు ఉండవు. జంక్, ఫ్యాటీ ఫుడ్ ఎంత తగ్గించుకుంటే అంత మంచిది. మంచినీరు ఎక్కువగా తాగాలి. పండ్లు, కూరగాయలు తీసుకోవాలి.ప్రతిరోజూ తప్పనిసరిగా వ్యాయామం చేయాలి. వాకింగ్, రన్నింగ్, యోగా, ఏరోబిక్స్ చేయడం ఉత్తమం. ఆహారంలో ప్రోటీన్లు, విటమిన్లు అవసరమైన మేరకు ఉండేలా చూసుకోవాలి. హార్మోన్స్‌ను సమతుల్యం చేసుకోవడం ద్వారా వ్యాధిని నయం చేసుకోవచ్చు. ఆహారంలో విటమిన్ డీ అధికంగా ఉండేలా చూసుకోవాలి.

– డాక్టర్ షమా సుల్తానా, ప్రసూతి, సంతాన సాఫల్య వైద్య నిపుణురాలు, గుంటూరు

ముందస్తుగా వైద్య పరీక్షలు మంచిది



ఆధునిక జీవనశైలి వల్ల నేడు చాలా మంది యువతులు పీసీఓడీ బారిన పడుతున్నారు. లక్షణాల గురించి తెలుసుకుని ప్రాథమిక దశలోనే వైద్యులను సంప్రదిస్తే త్వరగా నయం చేయవచ్చు. ప్రతి ఒక్కరూ దీనిపై అవగాహన కల్గి ఉండాలి. ఆధునిక వైద్య విధానాల వల్ల నేడు మందులతోనే నయం చేయవచ్చు. లక్షణాలు కనిపించిన వారు కంగారు పడిపోయి మనోవేదనకు గురికాకుండా వైద్యులను త్వరగా సంప్రదిస్తే ఉత్తమ ఫలితాలు వస్తాయి.

– డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్, ఐవీఎఫ్ వైద్య నిపుణులు, గుంటూరు

కేఎల్‌యూలో ముగిసిన యువజనోత్సవాలు



తాడేపల్లిరూరల్ : విద్యార్థులు కేవలం పాఠ్యపుస్తకాల్లో ఉన్న విజ్ఞానాన్ని చదివితే సరిపోదని, జీవితంలో ఎదురయ్యే అనేక సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలంటే నిబద్ధత, ఆత్మవిశ్వాసం, ఓర్పు, నిర్వహణ సామర్థ్యాలు, సంభాషణ నైపుణ్యాలు ఎంతో అవసరమని కేఎల్ యూనివర్సిటీ డీన్ డాక్టర్ ఎం.కిషోర్‌బాబు పేర్కొన్నారు. శుక్రవారం తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్‌యూలో బీఏ ఐఏఎస్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయస్థాయి సాహిత్య, విజ్ఞాన, సాంస్కృతిక యువజనోత్సవాలు (ఆత్రోబ్ 24) ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దుష్ప్రవర్తనకు, దుష్ప్రచారాలకు దూరంగా మెలగుతూ, ప్రతి విషయంలోనూ సానుకూల దృక్పథాన్ని విద్యార్థులు పెంపొందించుకున్నప్పుడు లక్ష్యాన్ని సులభంగా చేరుకోగలుగుతారని అన్నారు. బీఏఐఏఎస్ విభాగాధిపతి డాక్టర్ బి.శివనాగయ్య మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం నుంచి ఎంఏ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, పబ్లిక్ పాలసీ, డిజిటల్ హ్యూమానిటీస్ అనే రెండు కొత్త కోర్సులను ప్రారంభించనున్నామని తెలిపారు. కేఎల్‌యూతో పాటు వివిధ కళాశాలల నుంచి సుమారు 500 మందికి పైగా విద్యార్థులు ఈ సాహిత్య సాంస్కృతిక ఉత్సవాల్లో పాల్గొన్నారు. వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్, స్పాట్ ఈవెంట్స్, శాస్త్రీయ, పాశ్చాత్య, లలిత సంగీతాలు, మిస్టర్ అండ్ మిసెస్ తదితర 14 అంశాల్లో పోటీలు నిర్వహించి, బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ ఆచార్యులు డాక్టర్ కె.తాతారావు, విభాగ ఉప అధిపతి డాక్టర్ కె.అనిల్‌కుమార్, కార్యక్రమ కన్వీనర్లు డాక్టర్ జి.వెంకటేశ్వర్లు, డాక్టర్ బాలాజీ మానసారావు పాల్గొన్నారు.